

## సినీ రంగంలో రాణించాలి

వీడియో సాంగ్ లాంచ్ చేసిన గంట రవికుమార్

8లో..


# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 293 బుధవారం | 05 జూన్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5






# కార్యకర్తలే బలం

## నియోజకవర్గమే కుటుంబం

డాక్టర్ కడియం కావ్య పొలిటికల్ ఎంట్రీ

అండగా నిలిచిన 5,81,294 మంది ఓటర్లు

2.20లక్షల ఓట్ల మెజార్టీతో ఘన విజయం

వరంగల్ నుంచి పార్లమెంట్‌లో అడుగు పెట్టనున్న రెండో మహిళా డాక్టర్

వరంగల్ ఎస్సీ లోక్ సభ నియోజకవర్గానికి నువ్వా.. నేనా అన్నట్లుగా జరిగిన హొరాహొరీ పోరులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య అఖండ విజయం సాధించారు. 5,81,294 మంది ఓటర్లు ఆమెకు అండగా నిలువగా 2,20,339 ఓట్ల మెజార్టీతో కావ్య ఘన విజయం సొంతం చేసుకున్నారు. ఏ మాత్రం రాజకీయ అనుభవం లేని కావ్య తన తండ్రి, సీనియర్ పొలిటీషియన్, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అండతో విజయ తీరాలకు చేరడం ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో సంచలనంగా మారింది. అయితే కార్యకర్తలే తన బలం.. నియోజకవర్గమే తన కుటుంబంగా భావించిన ఆమె పార్టీ ఆదేశాలను శిరసావహించారు. అత్యంత క్లిష్ట పరిస్థితిలో కూడా పార్టీకి, కార్యకర్తలకు తోడుంటూ ప్రజల ఆశీర్వాదం, కాంగ్రెస్ పార్టీ సైనికుల అలుపెరుగని కృషితో విజయం సాధించారు. అయితే వరంగల్ లోక్ సభ నియోజకవర్గం నుంచి గతంలో తెలుగుదేశం నుంచి డాక్టర్ కల్పనా దేవి పార్లమెంట్ లో అడుగు పెట్టిన తొలి మహిళగా గుర్తింపు పొందగా, రెండో మహిళగా డాక్టర్ కడియం కావ్య నిలువనుంది. ఇద్దరూ డాక్టర్లే కావడం విశేషం. -వరంగల్ వాయిస్, వరంగల్



వివరాలు 2లో..



## చెట్లే జీవనాధారం

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

8లో



## ప్లాస్టిక్‌ను తరిమేద్దాం

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..

న్యాయమూర్తుల పిలుపు

8లో

# కార్యకర్తలే బలం

## నియోజకవర్గమే కుటుంబం




**డాక్టర్ కడియం కావ్య పొలిటికల్ ఎంట్రీ**

**అండగా నిలిచిన 5,81,294 మంది ఓటర్లు**

**2.20లక్షల ఓట్ల మెజార్టీతో ఘన విజయం**

**వరంగల్ నుంచి పార్లమెంట్‌లో అడుగు పెట్టనున్న రెండో మహిళా డాక్టర్**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాజకీయాల్లో అపార అనుభవం ఉన్న కడియం శ్రీహరినే ఆమె రోల్ మాడల్ గా ఎంచుకుంది. స్వయం కృషితో పాటు నిజాయితీ కలిగిన రాజకీయ వేత్తగా ఎదిగిన తన తండ్రి అడుగు జాడల్లో నడవాలని డాక్టర్ కడియం కావ్య నిశ్చయించుకుంది. ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తూనే నిరుపేదలకు అండగా నిలిచారు. సామాజిక సేవే రాజకీయాలకు అసలైన పునాదిగా భావించిన ఆమె ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వేలాది మంది పేదింటి బాలికలకు నెలసరి సమస్యను తీర్చేందుకు కృషి చేశారు. నిరుపేదలకు పాఠ్య పుస్తకాలు అందించి ఆదుకున్నారు. రాజకీయాల్లో తనకు ఏ మాత్రం అనుభవం లేకున్నా తన తండ్రి సలహాలు సూచనలతోనే విజయ బావుట ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో నిలిచి 2,20,339 ఓట్ల భారీ మెజార్టీతో ఎంపీగా గెలుపొందారు.

### 40 ఏళ్ల తర్వాత..

వరంగల్ లోక్ సభ నియోజకవర్గంనుంచి 1984లో తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసిన డాక్టర్ కల్పనా దేవి పార్లమెంట్‌లో అడుగు పెట్టిన తొలి మహిళగా గుర్తింపు పొందారు. తిరిగి 40 సంవత్సరాల తర్వాత డాక్టర్ కడియం కావ్య ఇదే లోక్ సభ నియోజకవర్గంనుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అయితే ఇద్దరూ డాక్టర్లే కావడం విశేషం. కల్పనా దేవికి రాజకీయాల్లో విశేష అనుభవం ఉండగా కడియం కావ్య మాత్రం ఎలాంటి రాజకీయ అనుభవం లేకుండా తొలి ప్రయత్నంలోనే విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగు పెట్టనున్నారు.

### హామీలన్నీ నెరవేర్చుతా..

ఈ ప్రాంత బిడ్డనైన తనకు పార్లమెంట్‌లో అడుగుపెట్టే అవకాశాన్ని ఇక్కడి ప్రజలు కల్పించారని డాక్టర్ కడియం కావ్య తెలిపారు. వారి అభీష్టం మేరకు పనిచేయడం తన కర్తవ్యం అన్నారు. లోక్ సభ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు. వరంగల్ సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతానన్నారు. గతంలో ఎంపీగా పనిచేసిన తన తండ్రి సలహాలు, సూచనలతో ముందుకెల్తానన్నారు. ఓరుగల్లు చిరకాల వాంఛ అయిన విమానాశ్రయం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, పరిశ్రమలు, యువతకు ఉపాధి, ఐఐఎం లాంటి సంస్థల ఏర్పాటుకు పార్లమెంట్‌లో గళమెత్తుతానని ప్రకటించారు.

### సీఎంను కలిసిన ఎంపీ..

హైదరాబాద్ లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో బుధవారం ఆయనను తన తండ్రి స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి డాక్టర్ కడియం కావ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి డాక్టర్ కడియం కావ్యకు శుభాకాంక్షలు తెలిపారు. కావ్యతోపాటు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య, పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సి రాజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు సీఎంను కలిశారు.


























# రైతులకు రుణమాఫీని వెంటనే అమలు చేయాలి

## పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలి

## ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బాలరాజు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అఖిలభారత రైతుకూలీ సంఘం నర్సంపేట డివిజన్ కార్యవర్గ సమావేశం బుధవారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు గట్టి కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాచర్ల బాలరాజు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు తమ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోటే రెండు లక్షల రుణమాఫీ అమలు చేస్తామని చెప్పి ఆచరించలేకపోయింది. పైగా, ఆగస్టు 15లోపు అమలు చేస్తామని ప్రకటించింది. కానీ, ఇప్పటికే రైతులు అప్పుల బారిన పడి బ్యాంకులిచ్చిన రుణాలకు వడ్డీలు కట్టలేక సతమతమవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రుణమాఫీ కార్యక్రమాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో గత 40 సంవత్సరాలుగా గిరిజన గిరిజన పేదలు పోడు వ్యవసాయం చేసుకుంటున్నారని వారికి శాశ్వత పట్టాలు లేకపోవడం వల్ల ప్రతి ఖరీఫ్ సీజన్లో ఫారెస్ట్ అధికారులు దాడులు చేసి పంటలను ధ్వంసం చేస్తున్నారని, అలా జరగకుండా వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పట్టాలివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు పంట నష్టపోతే వారికి 2005 యాజమాన్య హక్కు చట్ట ప్రకారం నష్టపరిహారం అందాల్సి ఉండగా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, ఇప్పటికైనా పూర్తి నష్టపరిహారం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అలాగే, పంటల బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని ఆయన కోరారు. ఇందులో గత మోడీ ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీలను చెప్పించి వారికి లాభాలు అందే విధంగా విధానాలు తయారు చేసిందని, ఇకముందు అలా జరగకుండా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామాలలో అసంబద్ధంగా కొనసాగుతున్నదని కూలీలకు ఒక రోజుకు రూ.125లను మాత్రమే అందుతున్నదని వారికి పనిచేసే ప్రాంతంలో తగిన సౌకర్యాలు ఉండడం లేదని, రోజుకు రూ.600 చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, సంవత్సరానికి 150 నుంచి 200 రోజులు పని కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం డివిజన్ కార్యదర్శి జక్కుల తిరుపతి, సభ్యులు గుగులోతు భద్రాజి, మల్లయ్య, వీరారెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించాలి

## ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలని, అనుమతి లేని కళాశాలల జాబితా విడుదల చేయాలని కోరుతూ బుధవారం ఇంటర్ విద్యాశాఖ అధికారి డీఐఈఓ మాధవ్ రావుకు ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ వినతి పత్రం అందజేశారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమస్యలు పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు భర్తీ చేసే విధంగా చర్యలు చేపట్టి, ప్రైవేట్, కార్పోరేట్ కళాశాలల్లో వసూలు చేస్తున్నఅధిక ఫీజులను నియంత్రించి, ప్రభుత్వ అనుమతి లేని కళాశాలల జాబితాను బహిర్గతం చేసి, ఇంటర్ నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన విద్యాశాఖ అధికారిని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అభిరామ్, శివ, రాకేష్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో బలమైన పార్టీగా కాంగ్రెస్

## కడారి నాగేశ్వరరావు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** తెలంగాణ రాష్ట్రంలో బలమైన పార్టీగా కాంగ్రెస్ పార్టీ ఎదుగుతుందని ఎన్నికల్లో పార్టీ బలాన్ని ఓట్ల ద్వారా ప్రజలు నిరూపించారని, అన్ని వర్గాలు చూపు కాంగ్రెస్ వైపు ఉందని జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ మాజీ ఎంపీటీసీ కడారి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన రఘునాథపల్లిలో మాట్లాడుతూ రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వ చేపడుతున్న ఆరు గ్యారెంటీలతోనే ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలు విజయం సాధించారని, సోనియా గాంధీ నాయకత్వంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకొనే దిశగా ముందుకెళ్తామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్లకు సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసుకున్న అదృష్టం లభించిందని ఆయన వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు దశలవారీగా అమలవుతాయని ఆయన తెలిపారు. రాహుల్ గాంధీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పని చేస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గ్రామ గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# అతిథి దివ్యాంగుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హైదరాబాద్ ఈస్ట్ జోన్ డీసీపీ రావుల గిరిధర్ జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం విశ్వబ్రాహ్మణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెడ్డికాలనీలోని అతిథి దివ్యాంగుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు అన్నదానం కోసం అసోసియేషన్ బాధ్యుడు పెద్దోజు వెంకటచారి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఎంజీఎం ఆస్పత్రిలో 35వ సారి రక్తదానం చేశాడు. ఈ కార్యక్రమంలో షణ్ముఖ చారి, వేణు, రాము, సర్వేశ్వర్, రాజు, రవీందర్, సిద్దోజు రాకేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష మందికి మజ్జిగ పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లాలోని ఆర్యవైశ్య మిత్రబృందం ఆధ్వర్యంలో మేదరి వాడ కార్యాలయం ముందు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆర్యవైశ్య మిత్ర బృందం అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్యవైశ్య మిత్రబృందం ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమం మజ్జిగ, అన్నదానం, ఉప్మా, అరటిపండు, స్వీట్స్ పంపిణీ కార్యక్రమం 60 రోజులు 85 మంది దాతలు 2,700 కిలోల మజ్జిగ పెరుగు, ఆరువేల లీటర్ల వాటర్, మూడు క్వింటాల అన్న వితరణ వీటన్నిటిని సుమారు 60 రోజుల్లో లక్ష మందికి పంపిణీ చేయడం గర్వకారణమన్నారు. సుమారు రెండు నెలపాటు నగరంలో ఉండే ప్రముఖులు, వైశ్యులు వారి వారి పుట్టినరోజులు, పెళ్లిరోజు, అదేవిధంగా జ్ఞాపకార్థం గుర్తు చేస్తూ పంపిణీ కార్యక్రమం చేపట్టిన సందర్భంగా వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా కష్టపడి పనిచేసిన ఆర్యవైశ్య మిత్రబృందం నాయకత్వాన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పాల మురళీధర్, అల్లాడి వీరభద్రయ్య, అల్లా పరమేశ్వర్, మిత్తింటి సురేందర్, చిన్నాల సురేష్, పుల్లూరి రఘు, యాద గణేష్, సొల్లేటి కళావతి, పాల జయప్రకాష్, ధనలక్ష్మి, సంపూర్ణ, వనజ, సుప్రియ, జ్యోతి, రాజమణి, రేపాల హరి, తాటిపెల్లి రాజమణి, సోమ అనసూయ, అశోక్, యాదా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ప్రజలకు ధన్యవాదాలు

## నాలుగోసారి సీఎంగా చంద్రబాబు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలుగుదేశం పార్టీ అపూర్వమైన విజయంతో నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న నారా చంద్రబాబు నాయుడుకు వరంగల్ పార్లమెంట్ టీడీపీ తరుపున గట్టు ప్రసాద్ బాబు, రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి హనుమకొండ సాంబయ్య అభినందనలు తెలియజేశారు. ఆంధ్ర ప్రజలు అరాచక పాలనకు అంతం పలుకుతూ, అభివృద్ధి పట్ల స్వేచ్ఛ పట్ల తమ ఆకాంక్షను తెలుపుతూ ఏకపక్షంగా తెలుగుదేశం పార్టీకి అపూర్వమైన విజయాన్ని అందించినందుకు ఆంధ్ర ప్రజలకు అభినందనలు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నామని అన్నారు. ఈనాడు జాతీయ స్థాయిలో ఎన్నికల ఫలితాలను చూస్తే తెలుగుదేశం పార్టీ జాతీయ స్థాయిలో మళ్లీ చక్రం తిప్పబోతున్నదని, తెలుగుజాతికి మళ్లీ మంచి రోజులు రాబోతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి నియోజకవర్గం కోఆర్డినేటర్ ముక్కిరాల జనార్దన్ రావు, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తెలుగు వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీ వరంగల్ కార్యాలయం కార్యదర్శి పిట్టల శ్రీనివాస్ ముదిరాజ్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి భైరపాక ప్రభాకర్, పార్లమెంట్ సీనియర్ నాయకులు కందుకూరి చంద్ర మోహన్, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు వెలగందల రవీందర్ గుప్తా, తెలుగు యువత అధ్యక్షుడు పోతరాజు అనిల్, నీలం పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులను ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుదాం

## డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య

**వరంగల్ వాయిస్, ములుగు :** చిన్న పిల్లలకు టీకాలు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా బుధవారం డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య ములుగు మండలం రాయిని గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జంగాలపల్లి, కొత్తూరు, సర్వాపూర్ సబ్ సెంటర్ లతో పాటు రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా చేశారు. మూడు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలలో దాదాపుగా 15 మంది పిల్లలకు టీకాలు ఇవ్వడం తనిఖీ చేశారు. దీంతో పాటు ప్రతి ఆశలకు, ఏఎన్ఎంలకు ముందుగా ప్రతి గర్భిణీ స్త్రీని నమోదు చేసి డెలివరీ అయ్యి నెలన్నర రోజులు వరకు తల్లి పిల్లలను చూసుకోవలసిన





బాధ్యత మన ఆరోగ్య శాఖ సిబ్బందికి ఉందని తెలిపారు. అలాగే, మున్ముందు వర్షాకాలం ప్రారంభం కాబోతున్నందున కాలానుగుణంగా వచ్చే వ్యాధులు ప్రబలకుండా ఉండడానికి తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆశలకు, ఏఎన్ఎంలకు తగు సూచనలు చేయడం జరిగింది. మార్గమధ్యలో బావి తీస్తున్న కూలీలు కనపడగా అది ఒంటిగంట సమయంలో ఆగి ఎండ తీవ్రత దానివల్ల వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించడమే కాకుండా వారికి ఓఆర్ఎస్ పాకెట్లు అందించి ఒక లీటర్ నీళ్లలో ఒక పాకెట్ కలిపి తాగాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రవణ్ కుమార్, స్టాఫ్ నర్స్ మున్ని, ఏఎన్ఎంలు అల్లం సులోచన, అల్లం సుజాత, ఆశలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో మానవ పాత్ర గొప్పది




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ, ది.నేషనల్ కన్జుమర్ రైట్స్ కమిషన్ ఆధ్వర్యంలో నేషనల్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ అనితా రెడ్డి అధ్యక్షతన స్వధార్ మహిళా ఆశ్రమంలో పర్యావరణ పరిరక్షణలో మానవ పాత్ర అను అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు డాక్టర్ అనితా రెడ్డి బహుమతులు అందజేశారు. పర్యావరణ పరిరక్షణ గురించి వివరించి, పర్యావరణను కాపాడుకోకపోతే రానున్న కాలంలో జీవించడం కష్టమన్నారు. మన జీవన విధానాలతో పర్యావరణం కాలుష్యమవుతుందని హెచ్చరించారు. ప్లాస్టిక్ వినియోగం, చెట్లను నరకడం వలన అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని తెలిపారు. ఆధునిక యంత్రాలు వినియోగం పెరగడం, నియంత్రణ లేకపోవడం, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు అధికంగా వాడటం తద్వారా, భూగోళం వేడెక్కి జీవరాశులకు పెద్ద ముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు. కాబట్టి, ప్రతి ఒక్కరూ చెట్లను, వివిధ జీవ జాతులను పరిరక్షించాలన్నారు. ప్లాస్టిక్, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు తక్కువగా వాడి పర్యావరణ సమతుల్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు. ప్రతి పౌరుడు భూతాపాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని, ప్రతి పౌరుడు జంతువుల్ని, వృక్ష జాలాన్ని పరిరక్షించుకోవాలన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగం పెంచి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు విరివిగా అవలంభించాలన్నారు. అంతరించే ప్రమాదం ఉన్న జీవ జాతులను పునః ప్రతిష్ట చేసి రక్షించాలని తెలిపారు. విద్యార్థులు, యువత, ప్రజల్లో అవగాహన కలిగించాలని, జీవులని మనం రక్షిస్తేనే జీవ వైవిధ్యం మనల్ని రక్షిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, స్వధార్ నిర్వహకురాలు శైలజ పాల్గొన్నారు.

## పర్యావరణంపై అవగాహన ర్యాలీ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ అవరణలో స్థానిక ఎంపీడీఓ మొక్కలు నాటారు. అనంతరం స్థానిక వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టిక్ వస్తువులను నిషేధించడం, మన దైనందిన జీవితంలో జరిగే ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా జ్యూట్ బ్యాగులు, స్టీల్ వస్తువులను, క్లాత్ బ్యాగ్లను వాడడం, చెట్లను పెంచడం, నీటి సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ, సూపరింటెండెంట్, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఏవీవీ జూనియర్ కళాశాలలో..



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక ఏవీవీ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా "ధరిత్రి పునరుద్ధరణ, ఏడారీకరణ, కరువు కాటకాల నివారణ" అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పర్యావరణవేత్త రతన్ సింగ్ ఠాగూర్ విచ్చేసి మాట్లాడుతూ "మనభూమి మన ఫీచర్ భవిష్యత్తు" పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. భూమిపై ఒక ప్రాంతంలో జీవపదార్థాలను, నిర్జీవ పదార్థాలను కలిసి ఉండి వాటి మధ్య సంక్లిష్టమైన చర్యలు జరుగుతున్న ప్రాంతాన్ని (ఏకో సిస్టం) జీవావరణ వ్యవస్థ అని పిలుస్తామని, దీనికోసం మనం అడవులను నరకకుండా మొక్కలను నాటడం, ప్లాస్టిక్ నిర్మూలన, ఏడారీకరణ, కరువుకాటలను నివారించొచ్చున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ భుజంగ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అన్ని వనరులు సక్రమంగా ఉంటేనే మానవ అభివృద్ధి నిజమవుతుందన్నారు. అందుకే మనం అందరం జీవన విధానంలో పర్యావరణ పరిరక్షణను ఒక భాగంగా చేసుకొనవలసిన అవసరం ఆసన్నమైందన్నారు. కొడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా తీసుకొని ఎడల భావితరాలకు ఎడారులు, కరువు కాటకాలను అందిస్తాయన్నారు. అనంతరం రతన్ సింగ్ రూపొందించిన పర్యావరణ పరిరక్షణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అధ్యాపకులు లాజరస్, శ్రీకాంత్, భాస్కర్, సుధారాణి, కన్జ్యూమర్ ఆర్గనైజర్ విజయరావ్, మూగ శ్రీనివాస్, వలంటీర్లు అసద్, హరిత, కృష్ణవేణి, ఫయాజ్ పాల్గొన్నారు.

## గోపాల్ పూర్‌లో..



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హనుమకొండ గోపాల్ పూర్ ట్యాంక్ బండ్‌పై హరితహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన హనుమకొండ జిల్లా పీఆర్టీయూ తెలంగాణ ప్రధాన కార్యదర్శి రాహుల్ కార్ వెంకటేష్ మాట్లాడుతూ నేడు ప్రపంచంలో ప్రజలు ఎదుర్కొన్నటువంటి అత్యంత క్లిష్టమైన కాలుష్యకారక పరిస్థితిలో భారతదేశం ఎన్నో సవాళ్లను ఎదుర్కోవలసి వస్తుందన్నారు. దానికి కారణం అత్యధిక సంఖ్యలో చెట్లను నరకడం, అత్యధిక మోతాదులో ప్లాస్టిక్ వాడకం, పంట పొలాలలో మోతాదుకు మించిన క్రిమిసంహారక ఎరువుల వాడకం, కాలం చెల్లిపోయిన వాహనాలను నడపడం, థర్మల్ విద్యుత్ శక్తి ఉత్పత్తి కోసం వాడే ఉద్గారాల ద్వారా వెలువడే వాయు కాలుష్యాలు తదితర కాలుష్యకారక పదార్థాల వల్ల 'జెట్ విమానాల ద్వారా వెలువడే క్లోరో ఫ్లోరో కార్బన్ వల్ల ప్రపంచంలోని ఖండంలో ఓజోన్ పొర చిల్లు పడి మందగించిందని తెలిపారు. కాబట్టి, ప్రజలందరూ ప్రతిరోజు తమ కాలనీలలో ప్రతి ఒక్కరూ ఐదు మొక్కలు నాటడమే కాక వాటిని సంరక్షించే పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ కార్పొరేటర్ సునీల్, ప్రొఫెసర్ వీరన్న దామోదర్, ఉద్యోగులు ఉపాధ్యాయులు , మేధావులు, పర్యావరణ ప్రేమికులు పెన్షనర్స్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలి




**వరంగల్ వాయిస్, శాయంపేట :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వహించి పరిరక్షణ కోసం కృషి చేయాలని పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీ అన్నారు. బుధవారం వనసంరక్షణ సమితి- కాట్రపల్లి, ప్రజ్వల్ రైతు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న డెన్స్ ఫారెస్ట్ లో 200 మొక్కలు నాటారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు బాధ్యతగా వహించాలని, దీనికి గాను, పర్యావరణ పరిరక్షణకు ముఖ్యపాత్ర కేవలం రైతాంగమే వహించాలని, అధిక దిగుబడుల సాధించడం కోసం విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడడం వల్ల వాతావరణ కల్యుషితం అవుతుందన్నారు. సరైనటువంటి సమయంలో వర్షాలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నటువంటి కర్షకులు, ప్రజలు పర్యావరణాన్ని పరీక్షించే విధంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ప్రజ్వల్ రైతు సంఘం పీయూ మేనేజర్ గుడిమల్ల మానస చౌదరి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఐక్యరాజ్య సమితి పర్యవరణ పరిరక్షణకు 1973 నుంచి ప్రపంచ వ్యాప్తంగా చాలా కార్యక్రమాలు నేల నీరు పర్యావరణం బాగు చేయటం జరుగుతుందని రైతులందరూ వ్యవసాయ సాగులో వివిధ ఎరువులు, పురుగుమందులు నేలకు అందించడం వల్ల నేల సారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వన సంరక్షణ సమితి ఫారెస్ట్ అధికారులు రతన్ లాల్, ప్రవీణ్, ప్రజ్వల్ రైతు ఉత్పత్తి దారుల సంఘం సిబ్బంది, సునీల్, తిరుపతి, గౌస్, రవిచందర్, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలి

### కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటితే వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించవచ్చని మొక్కల ద్వారా స్వచ్ఛమైన గాలి లభిస్తుందని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా జై ఫార్మ్ సర్వీసెస్ ఫీల్డ్ ఆఫీసర్ మరుపల్ల దీక్షిత ఆధ్వర్యంలో ఉర్సు పద్మశాలి సంఘం కార్యాలయ ఆవరణంలో కార్పొరేటర్ మరుపల్ల రవి మొక్కలు నాటి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తమ తమ ఇండ్లతో పాటు ఖాళీ స్థలాల్లో చెట్ల మొక్కలు నాటి సంరక్షించినట్లయితే విరివిరిగా వర్షాలు కురిసి పాడి పంటలు అభివృద్ధి చెందుతాయని చెట్ల మొక్కలు నాటి సంరక్షించినప్పుడే మొక్కలు పెరిగి పెద్దగా అవుతాయన్నారు. చెట్ల మొక్కలు పెద్దగా అయిన తర్వాత పరిసరాలు అన్ని పచ్చదనంతో నిండి ఉండడం వల్ల మనకెంతో ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. చెట్ల మొక్కలు నాటి సంరక్షించినట్లయితే ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతుందన్నారు. వర్షాకాలంలో విరివిరిగా మొక్కలు నాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జై ఫార్మ్ సర్వీసెస్ ఫీల్డ్ ఆఫీసర్ మరుపల్ల దీక్షిత్ కనుకుంట్ల రవి వనం కుమార్, మరుపల్ల గౌతమ్, గూడూరు రవి, మడుత రామ్, గుల్లపల్లి నాగరాజు, బొప్పతి నరసింహారావు, కనుకుంట్ల స్వరూప, మరుపల్ల రచన, మరుపల్ల ఎలేంద్ర, గూడూరు మల్లికాంబ, మరుపల్ల అనూష, మడుద శాంత లక్ష్మి, గూడూరు రాణి, ఆడెపు సరస్వతి ఉన్నారు.

## పర్యావరణంపై అవగాహన అవసరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, చిన్ననాటి నుండి విద్యార్థులకు పర్యావరణం పట్ల అవగాహన కలిగించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని ప్రేరణ ఫౌండేషన్ అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఆత్మీయ హెల్పింగ్ సొసైటీ బాధ్యులతో కలిసి హనుమకొండ శాయంపేటలో ఉన్న బస్తీ బడి పరిసర ప్రాంతాలలో చెట్లను నాటారు. చెట్లు నాటమే నాటకమే కాకుండా వాటిని పరిరక్షించుకునే బాధ్యత కూడా మనదేనని ప్రముఖ సామాజిక వేత్త నిర్మల శ్రీనివాస్ అన్నారు. టీవీ అశోక్ కుమార్ మాట్లాడుతూ సుమారు 70 మొక్కలను నాటినట్లు వీటిని జాగ్రత్తగా రక్షించుకోవాలని స్థానికులను కోరారు. ఈ కార్యక్రమంలో పద్మావతి, చంద్రశేఖర్, శంకర్ గిరి, రమాదేవి, వెంకటగిరి విద్యార్థులు స్థానిక పెద్దలు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వాహకులు మిఠాయిలు పంపిణీ చేశారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



**వరంగల్ వాయిస్, గణపూర్ :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని డీఆర్డీఓ నరేష్, అదనపు డీఆర్డీఓ వసుమతి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం గణపూర్ మండలంలోని మైలారం గ్రామ పంచాయతీ అమృత్ సరోవర్ లో డీఆర్డీఓ, భూపాలపల్లిలో అదనపు డీఆర్డీఓ వసుమతి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవాళి పరిరక్షణను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని సూచించారు. సేద్యంలో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకం, అలాగే ప్రజల రవాణా అవసరాలు పెరగడంతో వాహనాలు వినియోగం, చెట్లు తగ్గిపోవడం, వాతావరణ కాలుష్యం వల్ల వాతావరణ సమతుల్యత దెబ్బతిని వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, అందువల్ల విరివిగా మొక్కలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొక్కల ప్రాముఖ్యతను వివరిస్తూ పర్యావరణ అనుకూల జీవితం ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో, ఈసీ, పంచాయతీ కార్యదర్శి, టీఏ, ఎఫ్ఏ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతల గెలుపు సంబరాలు



**వరంగల్ వాయిస్, పరకాల :** వరంగల్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో ఎంపీగా గెలిచిన డాక్టర్ కడియం కావ్య గెలుపు పట్ల పరకాల ప్రధాన మెయిన్ రోడ్డులో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రంగులతో సంబరాలు చేసుకోవడం జరిగింది. కావ్య గెలుపునకు కృషి చేసిన వరంగల్ పార్లమెంట్ ఇంచార్జిగా పనిచేసి ఎంతో ఓర్పుతో ప్రజలను సమావేశాల ద్వారా కృతజ్ఞత భావంతో ఓటర్లను కాంగ్రెస్ పార్టీ ద్వారానే అభివృద్ధి సాధ్యమని చాటి చెప్పిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి అభినందనలు తెలిపారు. అంతేగాక అత్యధిక మెజార్టీ ఇచ్చిన పరకాల నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గూడెల్లి సదన్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి చందుపట్ల రాజిరెడ్డి, నాయకులు చెరుపెల్లి మొగిలి, సుర సతీష్, ఒంటేరు రవికుమార్, మడికొండ సంపత్, బొచ్చు జితేందర్, బొచ్చు రవి, జూపాక కిషన్, మంద రవి, బొచ్చు రవికుమార్, ఏకు సుధాకర్, బొచ్చు సంపత్ పాల్గొన్నారు.

## ప్రసాద్ అప్పనికి డాక్టరేట్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్ మెంట్ పరిశోధకుడు ప్రసాద్ అప్పనికి విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.నరసింహ చారి డాక్టరేట్ ప్రకటించారు. డాక్టర్ ప్రసాద్ అప్పని "ఇంపాక్ట్ అఫ్ కార్పొరేట్ ఆక్షన్స్ ఆన్ స్టాక్ ప్రైసెస్ - ఎ స్టడీ (ఇంపాక్ట్ అఫ్ కార్పొరేట్ యాక్షన్స్ ఆన్ స్టాక్ ప్రైసెస్-ఏ స్టడీ )"అనే అంశంపై విభాగ ఆచార్యులు ఆచార్య పి.వరలక్ష్మి పర్యవేక్షణలో పూర్తి చేశారు. కరీంనగర్ కు చెందిన డాక్టర్ ప్రసాద్ అప్పని ప్రస్తుతం కరీంనగర్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు. పులువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు డాక్టర్ ప్రసాద్ అప్పనిని అభినందించారు.

## కుంటలను మింగేస్తున్న సాయి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని పులిగిల్ల గ్రామంలో మళ్లీ అక్రమంగా పరకాల నుంచి నార్లపూర్ ఆర్ అండ్ బీ రోడ్డు మరమ్మత్తు పనులను మట్టి తరలిస్తూనే ఉన్నారు. వారం రోజుల క్రితం చర్లపల్లి గ్రామంలో రైతులు అడ్డుకోగా మళ్లీ పులిగిల్ల గ్రామంలోని తుమ్మల కుంట చెరువులోకి చొరబడి యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు కొనసాగిస్తున్నారు. మొన్నటి మొన్న చర్లపల్లి గ్రామస్థులు ఇరిగేషన్ డీఈకి, ఈఈకి కంప్లైంట్ చేశారు. అయిన కూడా మళ్లీ పులిగిల్ల గ్రామంలో అదే తంతు కొనసాగిస్తుండగా గ్రామానికి చెందిన ఇనుగాల సాంబయ్య అనే వ్యక్తి అడ్డుకున్నారు. పలు వార్తా పత్రికల్లో మట్టి రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరిన కూడా అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోక పోతే భవిష్యత్తు లో కుంటలలో నీటి నిలువకు గానీ, గ్రామస్థుల అవసరాలకు మట్టి గానీ, మొరం గానీ దొరకని పరిస్థితి ఏర్పడి ఇబ్బందులు ఎదుర్కొంటామని, ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

## బలరాం గెలుపు ప్రజా విజయం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి ఎంపీగా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన పోరిక బలరాం నాయక్ గెలుపు ప్రజా విజయం అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి డీవై గిరి అన్నారు. మహబూబాబాద్ ఎంపీ నివాసంలో ఆయన్ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కృషి చేయగా, ప్రజలు సైతం కాంగ్రెస్ పార్టీని ఆదరించి బ్రాహ్మ రథం పట్టారన్నారు. జరిగిన ఎన్నికల్లో ముఖ్యంగా మహిళలు కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పని చేశారన్నారు. ఈ సందర్భంగా ఎంపీ బలరాం నాయక్ ను డోర్నకల్ నియోజకవర్గం ప్రముఖులు నున్న రమణ, కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, టేకుల యాదగిరి రెడ్డి, జొన్నలగడ్డ సీతారాం రెడ్డి, కాలం రవీందర్ రెడ్డి, రాంలాల్, అంబరీష, సంపేట రాము, మెంతు అశోక్, జరిపోతుల రంగన్న తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## బండి సంజయ్‌ను కలిసిన కనుకుంట్ల రంజిత్ కుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా రెండో సారి రెండు లక్షలకు పైగా మెజార్టీతో ఎన్నికైన బండి సంజయ్ కుమార్ ను వరంగల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్ కుమార్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# మహిళా రాజకీయ, ఆర్థిక, సాధికారతకై ఉద్యమిద్దాం

### భారత మహిళా సమాఖ్య నేత నేదునూరి జ్యోతి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత జాతీయ మహిళా సమాఖ్య 70వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం హనుమకొండలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆవిర్భావ దినోత్సవ సదస్సుకు మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మంచాల రమాదేవి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి హాజరై మాట్లాడుతూ మహిళా హక్కుల పరిరక్షణకై నూతన మహిళా చట్టాల కోసం మహిళల జీవన హక్కుల పరిరక్షణ కోసం 1954, జూన్ 4న కలకత్తాలో అరుణా, ఆసఫ్ అలీ, రేణు చక్రవర్తి, అజారా బేగం, విమల, ఫ రోకి, గీతా ముఖర్జీ వంటి అనేకమంది మహిళ నాయకురాళ్ల ఆధ్వర్యంలో భారత జాతీయ మహిళా సమాఖ్య ఆవిర్భవించిందని తెలిపారు. 70 సంవత్సరాలుగా మహిళల హక్కుల సాధన కోసం నిరంతరం ఉద్యమాలు పోరాటా లు నిర్వహిస్తుందన్నారు. మహిళ చట్టాల కోసం అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మహిళలకు రక్షణ కల్పించాలని, మహిళలపై జరుగుతున్న అన్ని రకాల హింసలను అరికట్టాలని, ఇతర మహిళా సంఘాలను కలుపుకొని అనేక ఉద్యమాలను నిర్వహించి అనేక విజయాలు సాధించినదని తెలియజేశారు. హిందూ వివాహ చట్టం మనోవర్తి దత్తత విడాకులు పొందే హక్కు, ఆస్తి హక్కు, ఓటు హక్కు, హిందూ కోడ్ బిల్లు లాంటి అనేక చట్టాలను సాధించిన ఘనత భారత జాతీయ మహిళా సమాఖ్య దేనని అన్నారు మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ల కొరకు ప్రముఖ పార్లమెంటేరియన్ గీత ముఖర్జీ నాయకత్వంలో దాదాపు 30 సంవత్సరాల నుంచి ఉద్యమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ప్రస్తుత ప్రధాని మోడీ మహిళా ఓట్ల కోసం మహిళా బిల్లును ప్రవేశపెట్టినట్టే పెట్టి దానికి డిలిమిటేషన్ అనే సాకుతో ప్రస్తుత ఎన్నికలలో అవకాశం ఇవ్వకుండా దాటవేస్తున్నారని మండిపడ్డారు. మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదాలక్ష్మి జెండా ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ ఏ సమస్యలు వచ్చినా మహిళా సమాఖ్య ముందు వరుసలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం లలిత, తిరుమల, ఎండీ అమీనా, మండలి లక్ష్మి, నిమ్మల మాలతి, బైగిరి పుష్పలత, ఇల్లందుల పద్మ, ఎల్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బాల వికాస సేవలు మరువలేనివి




**వరంగల్ వాయిస్, నర్సంపేట :** బాల వికాస సంస్థ చేస్తున్న సేవలు మరువ లేనివని జల వికాస సంస్థ నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు పుచ్చకాయల కృష్ణారెడ్డి, బాల వికాస ప్రతినిధి సంపత్ అన్నారు. మండలంలోని రామవరం గ్రామంలో బాల వికాస వాటర్ ప్లాంట్ మహాసభ సభ బుధవారం ప్లాంట్ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు జినుకల రజని కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేదలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో గ్రామాల్లో బాల వికాస వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తుందన్నారు. అనంతరం ప్లాంట్ అధ్యక్షుడు జినుకల రజనికుమార్ మాట్లాడుతూ 7-1-2022లో జినుకల భూలక్ష్మి-నర్సయ్యల జ్ఞాపకార్థం జినుకల మొగిళి-కోమల దంపతుల ఆధ్వర్యంలో గది నిర్మించి ఇవ్వగా.. బాల వికాస సంఘిక సేవా సంస్థ ఆర్థిక సహాయంతో వాటర్ ప్లాంట్‌ను 162మంది సభ్యులతో ప్రారంభించుకున్నామని తెలిపారు. ఐదు రూపాయలకే 20లీటర్ల మంచినీటిని అందిస్తున్నామన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జినుకల నర్సింహరాములు, ఉపాధ్యక్షుడిగా జినుకల కిరణ్, ప్రధాన కార్యదర్శిగా జినుకల రజనికుమార్, సహాయ కార్యదర్శిగా జినుకల అశోక్, కమిటీ సభ్యులుగా జినుకల రాంబాబు, జినుకల విజేందర్, దండు రమాదేవి, కొడారి ప్రసన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

### వాగ్బాట యోగ సంఘం అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వాగ్బాట యోగ అండ్ వాకర్స్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు పెసర నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వాగ్బట యోగా సంఘం ఆధ్వర్యంలో రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగయ్యాయి. దీనివల్ల ప్రతీ చోట వీటి సాంద్రత పెరిగి, పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి కాలుష్యం సంభవిస్తోందని, ఫలితంగా నేడు ఈ పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది, దీనికి కారణం పర్యావరణ కాలుష్యమని అన్నారు. ప్రధానంగా జల కాలుష్యం, వాయు కాలుష్యం, భూ కాలుష్యం వలన నేటి మానవజాతి ఎన్నో రకాల సమస్యలను ఎదుర్కొంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ కాలుష్యం పట్ల చైతన్యవంతులై, పర్యావరణానికి నష్టం కలిగించే కారకాలను గుర్తిస్తూ, వాటి నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా చెట్ల పెంపకం చేపట్టాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పెరుమాండ్ల మధు, కోశాధికారి గుర్రపు రామచందర్, యోగా సంఘం సభ్యులు నవీన్ రెడ్డి, మోహన్, చిన్న, గోపాల్, శ్రీశైలం, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

### బీఆర్ఎస్ ఆఫీస్‌లో మొక్కను నాటిన నేతలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని బాలసముద్రంలో హనుమకొండ బీఆర్ ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్ ఆధ్వర్యంలో బుధవారం టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి మొక్కను పార్టీ కార్యాలయంలో నాటారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న కుడా మాజీ చైర్మన్ యాదవ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణానికి మొక్కలు ఎంతో అవసరమని, ఇంటికొక మొక్క నాటి ప్రపంచ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు. కాలుష్య బారి నుండి కాపాడుకోవడానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం పేరుతో కొన్ని కోట్ల మొక్కలు నాటడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఉడుతల సారంగపాణి, కేశవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, చాగంటి రమేష్, రవీందర్, దామోదర్ రెడ్డి, బొల్లు రవి, ఖలీల్, శ్రీనివాస్, వెంకన్న, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ.. అనాథకు అన్నీ తామై..

## మానవత్వం చాటుకున్న మానుకోట పోలీసులు

### దిక్కులేని బిడ్డకు.. పెద్దదిక్కుగా నిలిచిన ఎస్పీ



**వరంగల్ వాయిస్, మరిపెడ (కురవి) :** పెంచుకున్న అమ్మను కోల్పోయి నిలువ నీడలేకుండా నడిరోడ్డు మీద నిలబడ్డ మానస అనే 12సంవత్సరాల బాలిక విషయంలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ స్పందించిన తీరు చూసిన తర్వాత.. మానవత్వం నిండిన నిలువెత్తురూపం మహబూబాబాద్ పోలీస్ బాస్ రూపంలో మన మధ్యే ఉన్నాడనే నమ్మకం ఏర్పడింది. మానస విషయాన్ని వాట్సాప్ గ్రూప్ లో చూసిన జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ వెంటనే కురవి ఎస్ఐ గోపిని బాలిక ఇంటికి పంపించారు. తినడానికి తిండిగింజలు కూడా లేవనే పరిస్థితి తెలుసుకొని, నిమిషాలలో అరక్వింటా బియ్యం, పదిరోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. రూరల్ సీఐ సర్వయ్యను పంపించి ఎప్పటికప్పుడు అమ్మాయి



యోగక్షేమాలు వాకబు చేశారు. అంతేకాకుండా కురవిలో బుధవారం సాంప్రదాయబద్దంగా మానస చేత శశిరేఖకు దశదినకర్మ నిర్వహించారు. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాలతో సుమారు 150మందికి మంచి మాంసాహార భ్జాజనాన్ని ఏర్పాటు చేశారు. అనాథ ఇంటికి ఆత్మీయ అతిథులుగా.. ఊహించని బంధువులుగా మానస వద్దకు అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, మహబూబాబాద్ డీఎస్పీ తిరపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్ఐ గోపి వచ్చి శశిరేఖ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఫంక్షన్ హాల్ లో భోజనాలను ఏర్పాటు చేసి.. వారే స్వయంగా వడ్డించి, ఇష్టపంక్తి బోజనాన్ని నిర్వహించారు. శశిరేఖ మరణవార్తను, మానస దయనీయ పరిస్థితిని వాట్సప్ గ్రూప్ ద్వారా వెలుగులోకి తెచ్చిన మహబూబాబాద్ జిల్లా టీయూడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా అధ్యక్షుడే సీహెచ్ శ్రీనివాస్ ను కూడా ఈ సందర్భంగా పోలీస్ అధికారులు అభినందించారు. మానవత్వంతో స్పందించి అనాథకు అన్నీ తామై ఆసరాగా నిలిచిన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఈ సంఘటన తెలిసిన ప్రతి ఒక్కరూ ప్రశంసించారు. ఇంతటి చక్కటి మనసున్న మీరు నిండు నూరేళ్ళు చల్లంగా బ్రతకాలని దీవించారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**వరంగల్ వాయిస్, నడికూడ :** వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య భారీ మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు టిపిసిసి ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాదులోని ముఖ్యమంత్రి నివాసంలో రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భోజ్జం రమేష్, డీజీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు పెండ్యాల కొమురయ్య, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పర్నేం తిరుపతిరెడ్డి, లక్ష్మీపురం ఎంపీటీసీ సునీత శ్రీనివాస్, జిల్లా నాయకులు పెంచాల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఆర్‌తో వాకర్ ప్రాణాలను కాపాడిన రాజుకు సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్ లో రెండు రోజుల క్రితం ఉదయం వాకింగ్ చేస్తూ హార్ట్ స్ట్రోక్ కు గురైన వ్యక్తిని గమనించిన మరోక వాకర్ టీఎన్జీఓస్ యూనియన్ నాయకుడు పైడిగిద్ద రాజు సీపీఆర్, ప్రథమ చికిత్స చేసి కాపాడటం జరిగింది. అనంతరం అతడిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ వారు సమయానికి సీపీఆర్ చేసి వాకర్ ప్రాణాలను కాపాడిన రాజును నేడు గ్రౌండ్ లో సన్మానించి అభినందనలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాకర్స్ బైరి సోమయ్య, రాజేష్ ఖన్నా, సాంబయ్య, శ్రీనివాస్ రెడ్డి, పూర్ణ చందర్ తదితరులు పాల్గొని అభినందనలు తెలియజేశారు.

# మొక్కలు పెంచడం బాధ్యతగా తీసుకోవాలి

## డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నోముల కిషోర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడం బాధ్యతగా తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నోముల కిషోర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా బుధవారం 49వ డివిజన్ ప్రగతినగర్ లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనాలోచిత మానవులు చర్యల వల్ల పర్యావరణానికి వాటిల్లుతున్న అనార్ధల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ప్రకృతి సహజ సిద్ధంగా ప్రసాదించిన విలువైన సంపదలు భూమి, గాలి, నీరు, వృక్షాలు వీటి మీద ఆధారపడి జీవనం సాగించే మానవులకు తరగని సంపద లభ్యత పర్యావరణం అయితే సకల జీవ రాశులకు ప్రాణాధారం అయిన పర్యావరణం చేతులారా మార్పులు చేస్తూ నష్టపరుచుకుంటున్నారు. అభివృద్ధి అంటూ, ఆర్థిక అవసరాలు అంటూ అమ్మ లాంటి ప్రకృతిని దాడి చేసి దోచుకుంటున్నారన్నారు. మన జీవితంతో ముడిపడి ఉన్న భూమి, నీరు, గాలి మన పరిసరాలను, వాతావరణాన్ని ప్రభావితం చేస్తాయి. భూమి మీద మొక్కలు నాటి నీరు పోసి పెంచి ఆ మొక్కలు అందించే స్వచ్ఛమైన గాలిని పీల్చాలి.. ఇది ధర్మం కానీ, అభివృద్ధి, ఆధునికత పేరుతో భూమిని తవ్వుతున్నాం, చెట్లు నరికేస్తున్నాం, నీరు నిలిచేందుకు తావు లేకుండా చేస్తున్నాం. సహజత్వాన్ని కోల్పోతే సంకటాలు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతిని ప్రేమించండి




పర్యావరణన్ని రక్షించండి అంటూ పిలుపునిచ్చారు. భావితరాల భవిష్యత్తు కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఈ సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం వంటి కొన్ని సందర్భాలలో మొక్కలు నాటడం పరిమితం కాకూడదని, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగాలని సూచించారు. నాటిన మొక్కలు సాఫీగా ఎదుగుదలకు, నిశ్చింతగా బతకాలంటే వాటిని సంరక్షించాలని, వాటిని సంరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శివరాత్రి కర్ణాకర్, సముద్రాల అనిల్, మురళి, చామంతి, శారదా, శ్రీవేణి, ప్రశాంత్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తోట సుధాకర్ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రజాపక్షం బ్యూరో తోట సుధాకర్ 54వ జన్మదిన వేడుకలు బుధవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జర్నలిస్టు యూనియన్, ప్రెస్ క్లబ్ ప్రతినిధుల సమక్షంలో తోట సుధాకర్ కేక్ కట్ చేశారు. అనంతరం పలువురు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, సీనియర్ జర్నలిస్టు, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవ మూర్తి, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, ప్రెస్ క్లబ్ బాధ్యులు గోకారపు శ్యామ్, దుర్గా ప్రసాద్, బొడిగె శ్రీనివాస్, పొడిశెట్టి విష్ణు వర్ధన్, సంపెట సుధాకర్, విజయ్ రాజ్, వీరగోని హరీష్, జర్నలిస్టులు అంతడుపుల శ్రీనివాస్, శోభన్ బాబు, భరత్ ,ఎండి ఉస్మాన్ పాషా, తాండూరి గోపి,రమేష్, సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** క్రీడలతో మానసిక ఉల్లాసం, ఆరోగ్యం లభిస్తుందని సామాజిక కార్యకర్త రమణ బోయిన తెలిపారు. మండలంలోని గొల్లచర్ల గ్రామంలో ఖాజా బాయి మెమోరియల్ రెండు తెలుగు రాష్ట్ర స్థాయి క్రీడలు ఈ నెల 7 నుంచి ప్రారంభం అవుతున్న సందర్భంగా కబడ్డీ పోటీలో పాల్గొనే క్రీడాకారులకు, క్రీడా దుస్తులను అందించి మాట్లాడారు. రోజురోజుకు పెరుగుతున్న పోటీ ప్రపంచం, యాంత్రిక జీవనం వైపు పరిగెడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో దైనందిన జీవితంలో క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయన్నారు. క్రీడలతో మానసిక ఒత్తిడికి దూరమౌతుందన్నారు. మానసిక ప్రశాంతత, ఆరోగ్య వంతంగా జీవించవచ్చునని తెలిపారు. మొదటి బహుమతి రూ.50వేల నగదుతో పాటు షిల్డ్ అందిస్తున్న సందర్భంగా తెలుగు రాష్ట్రల కబడ్డీ క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియెగించుకోవాలని కోరారు. భీమనబోయిన సంతోష్, కోడవండ్ల యాదగిరి, చెటుపల్లి ఉప్పయ్య, తోట ప్రసాద్, పగిడిపల్లి రామకృష్ణ, చెరుకుపల్లి శ్రీనివాస్, గొడుగు సురేష్, చంద మహేష్, భీమనబోయిన శ్రీశైలం, సాగర్ తదితరుల పాల్గొన్నారు.

## పార్లమెంటు ఎన్నికల్లో మోడీకి గుణపాఠం


### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలతో పాలన సాగించి ప్రజల జీవితాలతో చెలగాటమాడిన బీజేపీ నేతృత్వంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి పార్లమెంటు ఎన్నికల్లో కార్మిక కర్షక శ్రమజీవులు తగిన గుణపాఠం చెప్పారని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్ శక్తులకు అప్పగించేందుకు నల్ల చట్టాలను తెచ్చి రైతుల ఉసురు పోసుకుని వందలాది మంది ప్రాణాలు కోల్పోవడానికి కారకుడైన మోడీకి రైతులు ఓటు ద్వారా బుద్ధి చెప్పారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి కార్మిక చట్టాలను, హక్కులను కాలరాచి, జాతి సంపదలు, వనరులు బడా పారిశ్రామికవేత్తలకు అప్పగించడం, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ప్రతి ఏటా నిధులు తగ్గించి కోట్లాదిమంది కూలీల పొట్టగొట్టి ఆ పథకాన్ని నిర్వీర్యం చేయడం, డీజిల్ పెట్రోల్ వంట గ్యాస్ తో సహా నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగాన్ని అంతులేకుండా పెంచి ప్రజల బ్రతుకులను దుర్భరం చేయడంతో అనేక రాష్టాలలో మోడీ పరాజయాన్ని చవి చూడాల్సి వచ్చిందన్నారు. బీజేపీకి సొంత మెజారిటీ దక్కలేదని ఎన్డీఏ కూటమి పార్టీలపై ఆధారపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ తో సహా ఇండియా కూటమి సీట్లు గణనీయంగా పెరిగి బలమైన ప్రతిపక్షంగా ఏర్పడిందని, ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తే ప్రజా పోరాటాలను ఎదురుకోవాల్సి వస్తుందని వెంకట్రాములు హెచ్చరించారు.

# 'కలర్ ఫోటో'.. జక్కన్నకు ఎందుకు నచ్చలేదు?





ఏంటి రాజమౌళికి కలర్ ఫోటో సినిమా నచ్చలేదా.. అదేంటి నేషనల్ అవార్డు సినిమా, అందరు మెచ్చిన సినిమా.. జక్కన్నకు ఎందుకు నచ్చలేదు అనుకుంటున్నారా..? అవును రాజమౌళికి కలర్ ఫోటో సినిమా నచ్చలేదట. ఈ విషయాన్ని స్వయంగా ఈ సినిమా దర్శకుడు సందీప్ రాజ్ చెప్పాడు. నేషనల్ అవార్డు వచ్చిన నెక్స్ట్ డేనే రాజమౌళి గారు ఫోన్ చేసి తన ఆఫీస్ కు రమ్మని పిలిచాడట. పిలిచి తనకు సినిమా నచ్చలేదని చెప్పాడట. దాంతో సందీప్ షాక్ అయ్యాడట. అయితే నచ్చనిది సినిమా కాదని ఎండింగ్ పార్ట్ మాత్రమే అని చెప్పాడట. కలర్ ఫోటో సినిమాను చాలా కన్విక్షన్‌గా తీశావు. హీరో క్యారెక్టర్‌కు తను కూడా కనెక్ట్ అయ్యాయనని చెప్పాడట. అయితే ఎండింగ్‌లో హీరో చనిపోవడం అనేది తనకు నచ్చలేదని చెప్పాడట. నెక్స్ట్ సినిమా నుంచి గుర్తు పెట్టుకో.. ఒక చావుతో సినిమా కథ మొదలవ్వాలి కానీ.. ఎండ్ అవకూడదని చెప్పాడట. హీరో డెత్ ఎప్పుడూ.. ఇంకోచోట మంచి జరిగితేనే చచ్చి పోవాలి అని చెప్పాడట. అలా ఆ రోజు రాజమౌళి చెప్పిన మాటలు తనకు ఒక భగవద్గీతలా అనిపించాయని సందీప్ రాజ్ ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు. నాలుగేళ్ల కిందట కరోనా కమ్మేసిన వేళ.. నేరుగా ఓటీటీలో రిలీజైన కలర్ ఫోటో సినిమా సృష్టించిన సంచలనాలు అన్నీ ఇన్నీ కావు. సుహాస్ హీరోగా, సందీప్ రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ట్రాజెడీ లవ్ స్టోరీ ఒక్క తెలుగు ఆడియెన్స్ నే కాదు.. యావత్ ఇండియా సినీ ప్రియులు మెచ్చిన సినిమాగా నిలిచింది.

# ఇలాంటి యాక్టర్ ప్రపంచంలోనే లేరు

డైరెక్టర్ శంకర్, హీరో కమల్ హాసన్, కాంబినేషన్‌లో భారీ బడ్జెట్ చిత్రంగా 'భారతీయుడు 2' విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా జూలై 12న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో భారీగా ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది. శనివారం నాడు చెన్నైలో సినీ ప్రముఖులు సమక్షంలో ఆడియో వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్ శంకర్ మాట్లాడుతూ.. ఈ రోజే సినిమా ఫైనల్ మిక్సింగ్ ను విన్నాను. అనిరుధ్ మ్యాజిక్ ను అద్భుతంగా చేశాడు. సంతో సినిమాకు సరికొత్త ఎనర్జీ వచ్చింది. ప్రేక్షకులకు కూడా సినిమా చూశాక అదే ఎనర్జీ వస్తుందని తెలిపారు. ఇండియన్ టైంలోనే కమల్ హాసన్ సీక్వెల్ తీద్దామని అడిగారని., కాకపోతే అప్పుడు నా వద్ద సరైన కథ లేదని చెప్పినట్లు తెలిపారు. చాలా ఏళ్లకు పేపర్స్ లో లంచం వల్ల జరిగే ఘోరాలు, అన్యాయాలు చూసి కథ ఇలా రాద్దామా..? అలా రాద్దామా..? అని అనుకున్నానని.. అయితే అప్పుడు నేను, కమల్ హాసన్ వేర్వేరు ప్రాజెక్టుల్లో ఉండటంతో కుదర్లేదని తెలిపాడు. రోబో 2. తరువాత ఈ కథ రాసుకున్నానని., అలా ఇండియన్ 2 మొదలైనాట్లు తెలిపారు. మొదటి రోజు షూటింగ్‌లో ఇండియన్ 2 గెటప్‌లో కమల్ హాసన్ చూసి అంతా షాక్ అయ్యామని ఆయన.. 28 ఏళ్ల క్రితం ఎలా అనిపించిందో.. అప్పుడు కూడా అలాంటి ఫీలింగ్ కలిగిందని తెలిపాడు. ఇండియన్ తాత మంచి వాళ్లకు మంచివాడు.. చెడ్డవాళ్లకు చెడ్డవాడు. ఇలాంటి పాత్రను చేయడం మామూలు విషయం కాదని తెలిపారు. ఇక కమలాసన్ 360 డిగ్రీ కంటే ఒక డిగ్రీ ఎక్కువగా నటించే సత్తా ఉన్న నటుడని, 70 రోజుల పాటు మేకప్ తో ఆయన నటించారని చెప్పుకొచ్చారు. ఆయనలాంటి యాక్టర్ ఈ ప్రపంచంలోనే లేరని శంకర్ తెలిపారు. ఆయనతో ఇండియన్ 2, ఇండియన్ 3 చేయడం చాలా ఆనందంగా ఉంది. నిజానికి ఈ ఇండియన్ 2 వేరే నిర్మాతతో సినిమా చేయాలి. అయితే లైకా నుంచి సుభాస్కరన్ ఫోన్ చేసి 'నేను నిర్మిస్తాను.. నాకు ఇండియన్ సినిమా అంటే చాలా ఇష్టం. నేనే నిర్మిస్తాను' అన్నట్లు తెలిపారు. ఇక చివరగా ఇండియన్ ఎంత పెద్ద హిట్ అయిందో ఇండియన్ 2 అంత కంటే పెద్ద హిట్ అవుతుందని నమ్ముతున్నట్లు ఆయన అన్నారు.



# ఎన్టీఆర్‌తో పోటీపడనున్న.. రజనీ






అగ్ర కథానాయకుడు రజనీకాంత్తన రాబోయే సినిమాల అప్‌డేట్స్ షేర్ చేశారు. ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా హిమాలయాలకు వెళ్లిన ఆయన అక్కడ సాధువులతో సమయం గడుపుతున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. తాజాగా మీడియాతో మాట్లాడుతూ అప్‌కమింగ్ సినిమాలు 'కూలీ', 'వేట్టయాన్'లకు సంబంధించిన వివరాలను పంచుకున్నారు. వేట్టయాన్' దసరా కానుకగా అక్టోబర్ 10న విడుదల కానుంది. నా పాత్ర షూటింగ్ పూర్తయింది. ఇతర నటీనటులకు సంబంధించిన కొన్ని సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. అలాగే లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' చేస్తున్నా. దాని షూటింగ్ జూన్ 10 నుంచి ప్రారంభించనున్నారు' అని తెలిపారు. తన ఆధ్యాత్మిక యాత్ర గురించి మాట్లాడుతూ.. 'ప్రతి ఏడాది ఇలా యాత్ర చేయడం వల్ల కొత్త అనుభూతి పొందుతాను. అందరికీ ఇలాంటి ప్రయాణం అవసరం. దీనివల్ల ప్రశాంతత లభిస్తుంది. దైవంపై నమ్మకం పెరుగుతుంది' అన్నారు. రజనీకాంత్ ఈ అప్‌డేట్ ఇచ్చిన దగ్గర నుంచి సోషల్ మీడియాలో 'దేవర' వర్సెస్ 'వేట్టయాన్' చర్చ మొదలైంది. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా రానున్న ఈ చిత్రం మొదటి పార్ట్‌ను అక్టోబర్ 10న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఈ చిత్రం తమిళంలోనూ రిలీజ్ కానుంది. దీంతో ఆ తేదీన బాక్సాఫీస్ వద్ద పోరు ఖాయమంటున్నారు సినీ ప్రియులు. 'వేట్టయాన్' విషయానికొస్తే.. టి.జె. జ్ఞానవేల్ దర్శకత్వంలో తెరకెక్కింది. ఇందులో అమితాబ్ బచ్చన్, ఫహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికా సింగ్, దుషారా విజయన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. దీంతో ఈ సినిమాపై అంచనాలు ఏర్పడ్డాయి.



# సూర్య మూవీలో పూజ హెగ్డే..

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం వరుస సినిమాలతో ఎంతో బిజీ గా వున్నారు.ప్రస్తుతం సూర్య నటిస్తున్న లేటెస్ట్ 'కంగువ'.కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శివ తెరకెక్కిస్తున్న ఈ సినిమాను స్టూడియో గ్రీన్ అండ్ యూవీ క్రియేషన్స్ బ్యానర్స్ పై జ్ఞానవేల్ రాజా , వంశికృష్ణ రెడ్డి మరియు ప్రమోద్ ఉప్పలపాటి సంయుక్తంగా నిర్మిస్తున్నారు.. భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో సూర్య సరసన బాలీవుడ్ బ్యూటీ దిశా పటాని హీరోయిన్ గా నటిస్తుంది.అలాగే యానిమల్ మూవీ ఫేమ్ బాబీ డియోల్ ఈ సినిమాలో విలన్ గా నటిస్తున్నారు. ఇదిలా ఉంటే సూర్య నటిస్తున్న మరో మూవీ ' సూర్య 44 '..ఈ సినిమాను కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ జిగర్ తండా డబల్ ఎక్స్ ఫేమ్ కార్తీక్ సుబ్బరాజు తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించనున్నారు.ఈ సినిమాలో పాపులర్ మలయాళ నటుడు జోజు జార్జ్ కీలక పాత్రలో నటిస్తున్నాడు.తాజాగా ఈ సినిమా కు సంబంధించి మేకర్స్ సాలిడ్ అప్డేట్ ఇచ్చారు.ఈ సినిమాలో స్టార్ హీరోయిన్ పూజ హెగ్డే హీరోయిన్ గా నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.తాజాగా పూజ హెగ్డేకు వెల్కమ్ చెబుతూ మేకర్స్ స్పెషల్ పోస్టర్ ను రిలీజ్ చేసారు.ఈ పోస్టర్ బాగా వైరల్ అవుతుంది.ఇదిలా ఉంటే ఈ సినిమా షూటింగ్ జూన్ నుండి ప్రారంభం కానున్నట్లు సమాచారం.




# ప్లాస్టిక్‌ను తరిమేద్దాం..

## పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. న్యాయమూర్తుల పిలుపు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్లాస్టిక్ ను తరిమేద్దాం..పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..అన్న నినాదంతో ప్రతీ ఒక్కరు పనిచేయాలని పలువరు న్యాయమూర్తులు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్లు బీవీ.నిర్మలా గీతాంబ, సీహెచ్.రమేష్ బాబు, అదనపు జిల్లా న్యాయమూర్తి మనీషా శ్రావణ్ ఉన్నమ్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు ఎం.సాయి కుమార్, జె.ఉపేందర్ రావు, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మాతంగి రమేష్ బాబు, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. మొక్కలను కాపాడుకోవడంతో పాటు, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించినపుడే పర్యావరణ కాలుష్యాన్ని కొంతైనా నిర్మూలించుకోగలమన్నారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టేందుకు అందరం కలిసి నడుం భిగించాలని కోరారు. అలాగే, పర్యావరణ ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ తిమ్మాపూర్ సమీపంలోని సెంట్రల్ ప్రిసన్ ను సందర్శించి అక్కడ మొక్కలు నాటారు. ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయి కుమార్, సెంట్రల్ ప్రిసన్ సూపరింటెండెంట్ టి.కళాసాగర్, జైలర్లు, ఖైదీలు పాల్గొన్నారు.



# చెట్లే జీవనాధారం

## పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

## పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** మానవాలి మనుగడకు చెట్లే జీవనాధారమని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్ లోని మహాత్మా జ్యోతి రావు పూలే ప్రజా భవన్ లో ఆమె మొక్కను నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వృక్షాలే మనిషి మనుగడకు జీవనాధారం అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. మొక్కలు పెంచడం, వాటిని సంరక్షించడం బాధ్యతగా చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. చెట్టును మనం కాపాడితే ఆ చెట్టు మనల్ని కాపాడుతుందన్నారు. మానవ జాతి మనుగడకు తొలి మెట్టు చెట్టు అన్నారు. మనమందరం భాధ్యత తీసుకొని మన పరిసరాలు, ఇంటి చుట్టూ, మీరు పని చేసే కార్యాలయ ఆవరణంలో చెట్లను నాటాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతీ ఒక్కరు కంకణ బద్దులు కావాలన్నారు.

# ప్రశాంతంగా టీజీఐ సెట్

## కన్వీనర్ ఆచార్య ఎస్.నరసింహ చారి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** 2024-25 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏలో ప్రవేశాలు పొందటానికి నిర్వహిస్తున్న టీజీఐ సెట్-2024 ప్రవేశ పరీక్ష బుధవారం ప్రశాంతంగా ప్రారంభమైనట్లు టీజీఐ సెట్ కన్వీనర్ ఆచార్య ఎస్.నరసింహ చారి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తేదీ ఉదయం మొదటి సెషన్ లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని ఎంపిక చేసిన 115 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 28,931 విద్యార్థులు నమోదు చేసుకోగా 25,982 మంది హాజరైనట్టు వెల్లడించారు. అదే విధంగా మధ్యాహ్నం జరిగిన రెండో సెషన్ లో ఎంపిక చేసిన 116 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 28,969 విద్యార్థులకుగాను 26,298 హాజరైనట్టు తెలిపారు. జూన్ 6 వ తేది ఉదయం సెషన్ తో ప్రవేశ పరీక్ష పూర్తి అవుతుందని ఆయన ప్రకటించారు. వరంగల్ రీజియన్ లోని వరంగల్, నర్సంపేట్ లోని ఎనిమిది సెంటర్లలలో 5 వ తేదీ ఉదయం మొదటి సెషన్ లో మొత్తం 1,554 విద్యార్థులు నమోదు చేసుకోగా 1,446 హాజరైనట్టు, అదే విధంగా మధ్యాహ్నం జరిగిన రెండో సెషన్ లో మొత్తం 1,554 విద్యార్థులు నమోదు చేసుకోగా 1,462 మంది విద్యార్థులు హాజరైనట్టు అయన వెల్లడించారు.

# ఘనంగా టైడ్ టర్నర్స్ ప్లాస్టిక్ ఛాలెంజెస్

## ఎల్బీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని లాల్ బహదూర్ కళాశాల ఎన్సీసీ ఆర్మీ పదో తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో బుధవారం 'టైడ్ టర్నర్స్ ప్లాస్టిక్ ఛాలెంజెస్ ' అనే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డిహెచ్ రావు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఆర్మీ ఎన్సీసీ పిలుపుమేరకు భద్రకాళి చెరువు ఏరియాలో ప్రజలకు అవగాహన కల్పించేదుకు ర్యాలీ నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా భద్రకాళి చెరువు కట్ట, మత్తడి ఏరియాలో ప్లాస్టిక్ ను ఏరివేశారు. ఈ కార్యక్రమం 10 తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ అజయ్ నంద కందూరి, అడ్మినిస్ట్రేటర్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ రవి సునహరే ఆజ్ఞ మేరకు నిర్వహించినట్లు తెలిపారు. దేశంలో ప్లాస్టిక్ తో అనేక అనర్థాలు జరుగుతున్నాయని, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోదన్నారు. ప్రతి పౌరుడు బాధ్యతతో భావితరాల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్లాస్టిక్ నిషేదానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధించినప్పటికీ దానిని ఇప్పటికీ వాడుతున్నారని అందుకే క్యాన్సర్ వ్యాధి విస్తృతంగా వ్యాప్తి చెందుతోందన్నారు. నీటి కాలుష్యం, వాయు కాలుష్యంతో అనారోగ్య సమాజంగా మారుతోందన్నారు. ఇందులో టెన్త్ తెలంగాణ బెటాలియన్ ఆర్మీ అధికారులు సందీప్, కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, సంతోషి జూనియర్ అండ్ ఆఫీసర్ కళ్యాణం, జూనియర్ అండ్ ఆఫీసర్ రజిని, శృతి, తిలక్, రాజేష్, విద్య, నౌ సిం, ఆసియా శివాని తదితరులు పాల్గొన్నారు.






# సినీ రంగంలో రాణించాలి

## వీడియో సాంగ్ లాంచ్ చేసిన గంట రవికుమార్

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ప్రముఖ యూట్యూబ్ నటుడు డి.నరేందర్ నటించి దర్శకత్వం వహించిన 'నిన్ను మరువకున్నా' విడియో సాంగును భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ బుధవారం శివనగర్ లోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ భవిష్యత్తులో సినీరంగంలో నరేందర్ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అగ్ర కథానాయకులతో పోటిపడి మన వరంగల్ కు వన్నె తేవాలని సూచించారు. ఈ విడియో సాంగ్ ఈ నెల 7వ తేదీ శుక్రవారం రోజున డీఎన్ఆర్ మ్యూజిక్ చానెల్ లో రీలిజ్ కానుంది. ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ ఇనుముల అరుణ్ తో పాటు ఇనుముల రాజు, కాలువ మహేష్ పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com